

**తళతళ మెరిసే పదును తేలిన గొడ్డలి దెబ్బ పడీ పడటంతో అబ్బా అని తడుముకుందా చెట్టు. దాని నిద్ర కాస్తా ఎగిరిపోయింది. తల విదిల్చింది. చెవులు రిక్కించింది. ఎవరా తనపై గొడ్డలిదెబ్బలు వేస్తుందని అటూ ఇటూ తలలు తిప్పి చూసింది.**

**అప్పటికే రెండు మూడు దెబ్బలు ధమా ధమామని ఒకదాని వెంట ఒకటి పడిపోయాయి. ఇంక తనకు భూమ్మీద నూకలు చెల్లాయని అర్థం కావడానికి ఎంతోసేపు పట్టలేదు.**

తన మీదేనా...! తన మిత్రుల మీద కూడానా...!అనుమానంగా చుట్టూ చూసింది.

# ఆకుపచ్చని కల

## మంచికంటి

అన్ని చెట్ల మీదా రాకాసి గొడ్డళ్ళు వికటాట్టహాసం చేస్తున్నాయి. అంటే ఈ వనం కూడా మనిషి స్వార్థానికి ఆహుతి అవుతుందన్నమాట. హతవిధీ ఏమి చేటుకాలం సంభవించిందో కదా! బాధపడుతున్న చెట్టుకి హఠాత్తుగా ఏదో గుర్తొచ్చింది.

అవును... తాత... తాత... ఎలా ఉంటాడో! రెమ్మల చేతులతో కొమ్మలు తొలగించి ఆతృతగా తొంగిచూసింది.

తనలాగా తాత కూడా ఉలిక్కిపడి లేచినట్టున్నాడు. చుట్టూ తిరిగి చూస్తున్నాడు. అన్ని చెట్లమీద పడే దెబ్బలన్నీ తన గుండెలపై పడుతున్నట్టుగా విలవిల్లాడుతున్నాడు. పరిగెత్తుకుంటూ గొడ్డళ్ళ దగ్గరకు వెళ్ళాడు. తల పైకెత్తి ఎగాదిగా చూశాడు.

"ఎవడ్రా వాడు...?" బిగ్గరగా అరిశాడు.

సమాధానం లేదు.

"ఎవరు కొట్టమన్నార్రా?" గద్దించాడు.

ఏ గొడ్డలీ సమాధానం ఇవ్వలేదు.

నువ్వెవడివోయ్ మమ్మల్ని అడగడానికి అన్నట్టున్నాయి ఆ గొడ్డలి దెబ్బలు. అయినా చెట్టు చెట్టుకూ తిరుగుతున్నాడు. వేడుకుంటున్నాడు. దణ్ణం పెడుతున్నాడు. ఏ గొడ్డలీ ఉలకలేదూ... పలకలేదూ...

తననే భూమ్మీద నుండి కూకటివేళ్ళతో పెకలిస్తున్నట్టు నిలువెల్లా కదిలిపోతున్నాడు. బిగ్గరగా అరుస్తూ నెత్తీ నోరూ బాదుకుంటున్నాడు.

ప్చ్... పాపం తాత... ఏమైపోతాడో ఏమో బాధగా మూలిగిందా వేప.

కరకు హృదయపు కోరల్తో తమ వొంటిని ఛిద్రం చేస్తున్న మూర్ఖుల్ని చూస్తుంటే కోపంకంటే కూడా జాలేసింది. తన ఆలనా పాలనా చూసే తాతను చూస్తుంటే గుండె చెరువౌతుంది.

ఆయన పడే వేదన చూస్తుంటే మనసు వికలమైపోతుంది. ఆ బాధ... అమ్మో... పగవాడికీ వొద్దు. తను చావబోతూ కూడా పదుగురికి ఫలాల్ని పంచిపెట్టే చెట్టు హృదయం మూగబోయింది. తానెక్కిన కొమ్మల్నే నరుక్కుంటూ ఎంత కృతఘ్నుంగా మారిపోతున్నారీ మానవులు చెట్టుకి దుఃఖం తన్నుకొచ్చింది. ఎవురు తీసుకున్న గోతిలో వాళ్ళే పడతార్లే బుద్ధిహీనులు అనుకుంటూ దీర్ఘంగా ఆలోచనలో పడింది. కళ్ళ వెంబడి ధారగా నీరు కారసాగింది.

కడతేరబోతూ కూడా తన కర్తవ్యాన్ని గుర్తు చేసుకుంది. కళ్ళు తుడుచుకుంది. గుండె దిటవు చేసుకుంది. ఏ రోజైనా పోయేదానికి ఏడుపొకటి ఎందుకులే అనుకుంది. అటువైపుగా పోతున్న పైరగాలిని పిల్చింది. ఇటువైపుగా వొస్తున్న చిరుగాలిని బతిమాలింది. ఎక్కడో ఉంటున్న పడమటి గాలినీ తోడు తెచ్చుకుంది. సర్వప్రాణులకూ ఔషధంగా ఉపయోగపడే తన సువాసనని నలుదిక్కులకూ పంచి రమ్మని ప్రార్థించింది.

ఏదో గుర్తొచ్చింది. అమ్మో తన నేస్తాలు...! పేరు పేరునా తనపై గూళ్ళు కట్టుకున్న పక్షులన్నింటినీ ఎలుగెత్తి కేకేసింది.

రెక్కలల్లార్చుకుంటూ వొచ్చి తనపై వాలిన పక్షుల్ని చూసింది. సహస్ర బాహులతో దగ్గరగా తీసుకుని పొదివి పట్టుకుంది. భోరుమని ఏడ్చింది. అవి కూడా కిలకిలా రావాలు మాని బెంగటిల్లిపోయాయి.

అన్నిటికీ ఏడుపు ముంచుకొచ్చేసింది. ఒకదానిపై ఒకటి పడి ఏడ్చాయి. పెడబొబ్బలు పెట్టాయి. వొచ్చిన విపత్తుని తల్చుకుని ఒకదాన్ని ఇంకొకటి ఓదార్చుకున్నాయి.

మన సంగతి సరే గానీ, అటు చూడండి దుఃఖంలోనే చెప్పింది చెట్టు.

**కథ**

పక్షులన్నీ ఏడుపులు ఆపాయి వేప చేయి చూయించిన వైపుకు చూశాయి.

పిచ్చి పట్టినవాడులా కనిపించాడు తాత. అయ్యో పాపం అన్నాయి పక్షులన్నీ.

తనకు ఊహ తెలిసినప్పటి నుండి నన్నొక మహా దైవంగా పూజించేవాడు. స్నేహితుడులాగా లాలించేవాడు. ఏ పని చెయ్యాలన్నా నాకు టెంకాయ కొట్టి, దణ్ణం పెట్టుకొని ఏం చెయ్యబోతున్నదీ చెప్పుకుని అప్పుడు కదిలేవాడు. నా నీడలో ఎన్నో పశువులకి ఆశ్రయం కల్పించేవాడు. ఊళ్ళో తనకు తెలిసిన వాళ్ళందర్నీ నా నీడన కూర్చోబెట్టేవాడు. వాళ్ళు చెప్పే ప్రతి మాటా వినేవాడు. వాళ్ళ దుఃఖాల్లో, ఆనందాల్లో, బాధల్లోనూ, భయాల్లోనూ పాలు పంచుకునేవాడు.

తన కళ్ళముందే ఎన్నెన్నో ఘోరాలు జరిగిపోవడం చూశాడు. అదుగదుగో... ఆ... కనిపిస్తుంది చూడండి. అనుభవాల్నీ నెమరు వేసుకుంటూ పడి ఉందే భూమి. అది ఆ భూమే... ఆ భూమిలోనే చూడండి. శవాలపై గుర్తుగా పాతిపెట్టిన శిలువల్లా ఉండాయే రాళ్ళు భూమిని ముక్కలుగా చేసుకొని అమ్ముకున్నదానికి గుర్తుగా...! ఎండి బీటలు వారిన ఆ నేలే... ఒక్క వాన చుక్కకోసం ఎన్ని నోళ్ళు తెరిచి ఎదురుచూస్తుందో!

ఆనాడు ఎంత వైభవంగా ఉండేది. అన్నీ పొలాలే. ఎటు చూసినా

పైరులే. విత్తనాలు నాటేవాళ్లు, నాట్లు వేసేవాళ్ళు, కలుపులు తీసేవాళ్లు... ఓహ్... పచ్చపచ్చని ప్రకృతే. గలగల్లాడే గజ్జెల్లా జలజల పారే నీటికళ. ఓహోహో... పిల్లల తల్లులు, తల్లుల పిల్లలు ఎంతెంత మందో! నా కొమ్మల నిండా ఎన్నెన్ని ఉయ్యాల్లో. ఎంత ముచ్చటగా ఉండేవాళ్ళో పిల్లలు.

గాలి సాయంతో నేను ఉయ్యాల ఊపుతుంటే, వాళ్ళు కొట్టే కేరింతలకి ఎంతగా మురిసిపోయేదాన్నో. వేళకు తల్లులు అందరూ వొచ్చి పిల్లలకు పాలిస్తూ జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి ఆప్యాయంగా నిమురుతుంటే ఓహో వాళ్ళు పులకించిపోయేది.

తన పొలంలో పని చేసేవాళ్ళని అందర్నీ కన్నబిడ్డల్లాగా చూసేవాడు తాత. ఎవరికి ఏ ఆపద వొచ్చినా తనకే వొచ్చినట్టుగా గిలగిల్లాడిపోయేవాడు. పొలంలో పంట పండినప్పుడు చూడాలీ... నా సామిరంగా ఊరంతా కల్లాల మీదే... చేటలతో గంపలతో ధాన్యం ముంచి పోస్తా ఉంటే బస్తాల్ని మొయ్యలేక మొయ్యలేక చచ్చేవాళ్ళు.

మీ తాత ముత్తాతలు మాత్రం... ఆ పొలాల మీదే పడి తినేదీ... వొచ్చి నా వొళ్ళో తల దాచుకునేది.

"మరి మా అమ్మా నాయనలు" ఒక పిట్ట అనుమానం వెలిబుచ్చింది.

"ఎన్నో బతుకులు ఆ పొలాల మీద ఆధారపడి ఉండేవి. రానురానూ... అదే మీ అమ్మా నాయనల కాలానికి ఆ గింజల పంటలన్నీ కనుమరుగైపోయాయి.

పత్తి, పొగాకు పంటలు కొంతకాలం రాజ్యమేలాయి. పొలాల్లో మనుషుల సందడి తగ్గిపోయింది. కొంత కాలానికి ఆ పంటల మీదా కోలుకోలేని నష్టాలు వొచ్చాయి. అప్పటికి తాత హయాం పోయి కొడుకుల పెత్తనాలు వొచ్చాయి. పొలాలన్నీ బీళ్ళు పడిపోయాయి.

ఫెళ ఫెళ మంటూ ఉరుము లాంటి పెద్ద శబ్దం వొచ్చింది. ఏంటా అని తల తిప్పి చూసింది వేప. తన శరీరంలో దృఢమైన, విశాలమైన బాహువు నేల కూలడం కనిపించింది.

ఎంత ఆప్యాయంగా, ఎన్నో సంవత్సరాలు కంటికి రెప్పలా కాపాడుకున్నాను. ఆ కష్టమంతా ఇప్పుడు బూడిదపాలైపోయిందే...!" కన్నీరు పెట్టుకుంది బాధగా.

"ఊరుకోమ్మా ఊరుకో కష్టాలు పచ్చటి చెట్లకు గాక రాతిస్తంభాలకు వస్తాయా" అని ఓదారుస్తూ "తరవాతేమైందమ్మా" ఆతృతగా అడిగాయి పక్షులు.

రోడ్లు బాగా విశాలంగా మారిపోయాయి. దాంతో పొలాలకి మంచి రేట్లు వొచ్చేశాయి. తరిగే పొలాల్ని చూసేవాడు. తన శరీర భాగాలు ఒక్కటొక్కటిగా తీసేస్తుంటే బాధపడతారు చూడండి. అట్టా గిలగిల్లాడిపోయేవాడు. కొంతకాలం అన్నం నీళ్ళు ముట్టడం మానేశాడు.

కాలం మా మంచి మందు కదా! ఆ మార్పుని క్రమేణా జీర్ణం చేసేసుకుంది. అప్పటినుండీ ఇంటికి దగ్గరగా ఉండే పూలతోటల్నీ, పండ్లతోటల్నీ చూసుకుని మురిసిపోయేవాడు. పూలతో మాటలు చెప్పేవాడు, పండ్లతో ముద్దూ ముచ్చట్లాడేవాడు. తన బాధల్నీ, సంతోషాల్నీ వాటితోనే పంచుకునేవాడు. నిద్ర లేచింది మొదలు పడుకోబోయేదాకా అక్కడే ఉండేవాడు.

పిలవంగా పిలవంగా ఎప్పుడో వెళ్ళి నాలుగు ముద్దలు తినేవాడు. ఆ కాసేపటికే తోట ఏమైపోయిందోనని అల్లల్లాడిపోయేవాడు.

తన కళ్ళ నిండా పూలూ, పళ్ళతో ఎప్పుడూ కమ్మని కలలు కంటుండేవాడు. ఎంతమంది పిల్లలు ఆ తోటల మీద తుమ్మెదలై వాలేవాళ్ళో. కోరుకున్న పండ్లు తినేవాళ్ళు. తాతకి బహుమతులు తెచ్చేవాళ్ళు అప్పుడప్పుడూ.

"నాకెందుకురా ఇయ్యన్నీ తీసకపోయి మీరే ఆడుకోండని" మృదువుగా తల నిమురుతూ చెప్పేవాడు.

**కాలం మా మంచి మందు కదా! ఆ మార్పుని క్రమేణా జీర్ణం చేసేసుకుంది. అప్పటినుండీ ఇంటికి దగ్గరగా ఉండే పూలతోటల్నీ, పండ్లతోటల్నీ చూసుకుని మురిసిపోయేవాడు. పూలతో మాటలు చెప్పేవాడు, పండ్లతో ముద్దూ ముచ్చట్లాడేవాడు. తన బాధల్నీ, సంతోషాల్నీ వాటితోనే పంచుకునేవాడు. నిద్ర లేచింది మొదలు పడుకోబోయేదాకా అక్కడే ఉండేవాడు.**

ఒక్కో కొమ్మ నరికి పడేసినప్పుడు, పక్షులు ఎగిరిపోయి ఇంకో కొమ్మ మీద వాలుతున్నాయి. తన వంక చూసుకుంటే తనకే సిగ్గనిపించింది వేపకు. విశాలమైన వక్షస్థలంలా కొమ్మలన్నిటినీ సాచుకుని నిల్చుని ఉండే తన ఆకారం తానే పోల్చుకోలేనంత వికృతంగా మారిపోవడం చూసి తన మీద తనకే అసహ్యం వేస్తుంది. తొందర తొందరగా నరికేస్తే బాగుండు" కోపంగా అనేసింది వేప.

"అదేందమ్మా ఆ మాట అంటావు. చివరిసారిగా తనివితీరా మాట్లాడుకోవడానికే గదా మమ్మల్ని పిల్చావు" పక్షులన్నీ తల్లడిల్లాయి ఆ మాటలకు.

"ఊరుకోండి... ఊరుకోండి... ఊరకే అన్నాలే" సముదాయించింది.

"తరువాతేమైందో చెప్పవా!" పికిలిపిట్ట గోముగా అడిగింది.

"చెబుతాన్రా చిట్టీ చెబుతానుండు" అంటూ బుగ్గమీద ఆకుతో చిటికేసింది.

ఆ చక్కిలిగింతలకి అది కిలకిలా నవ్వింది.


"కొడుకులు ఇక్కడ నుండి పట్నానికి మకాం మారుస్తూ ఆ పూలతోటల్ని కూడా అమ్మకానికి పెట్టారు.

ఈసారి ఎవరికి చెప్పి ఏం ప్రయోజనం లేదూ అనుకున్నాడు. మందు డబ్బా ఎత్తి పట్టేశాడు. సమయానికి ఆస్పత్రికి తీసుకువెళ్ళేరు. లేకుంటే మీకు అస్సలు తాత కనిపించేవాడే కాదు. ఆస్పత్రినుండి రావడంతోనే తోటకు వెళ్ళాడు. మళ్ళీ అప్పుడు చూడాల. తోటలు కొట్టేస్తుంటే, ... కళ్ళముందే పచ్చటివనాలు నాశనమౌతుంటే, ...బతుకు నిండా పండిన కల కళ్ళముందే ఛిద్రమైపోతుంటే... నింగీ నేలా ఏకమయ్యేలా ఏడ్చాడు. ఆ తాతని చూసిన వాళ్ళకే గుండెలు అవిసిపోయాయి. తాతని పట్టడం ఎవురి తరమూ కాలేదు. అలా తోటలు కొట్టినన్ని రోజులూ కంటికి మింటికి ఏకధారగా ఏడుస్తూనే ఉన్నాడు.

చిటారు కొమ్మకెక్కావు చిలకమ్మా జారి పడతావమ్మా అనే లోపునే గొడ్డలి దెబ్బకు అదిరినకొమ్మ నుండి కాలుజారి కింద పడిపోయింది చిలకమ్మ.

"అయ్యో అయ్యో" అంటూ పక్షులన్నీ గోలగోలగా అరిశాయి.






"ఏం భయం లేదులే. కింద తాత ఉన్నాడుగా" భరోసాగా చెప్పింది వేప.

"పాపం పుట్టెడు శోకంలో ఉన్నాడు కదమ్మా తాత" లకుముకిపిట్ట అడిగింది.

"ఎట్లా ఉన్నా... చూశాడంటే మాత్రం తాత ఊరుకోడు చూస్తుండండి. అదుగో మీ గోలకు తలెత్తి చూశాడు. ఏడుస్తూనే పరుగు పరుగున వొచ్చి, చేయి అందించి అక్కున చేర్చుకున్నాడు. నెమ్మదిగా రెక్కల్ని నిమురుతూ లాలించసాగేడు.

"చూసేరా తాతకి మీ మీద ఎంత ప్రేమో! అంత బాధలోనూ ఎంత ఆప్యాయంగా నిమురుతున్నాడో చూడండి.

అప్పటికి చెట్ల కొమ్మలన్నీ నేల రాలాయి. ఆ తోపుకి రారాజులా ఉన్న వేప చెట్టు కూడా కొమ్మలన్నిట్నీ విదిలించుకుంది.

ఒక ఉన్మాదానంతర శ్మశానంలా, శ్మశానంలో శరీర భాగాల్లా, ఆ భాగాల్నించి వొలికిన రక్తంతో ఆ ప్రదేశమంతా ఆకుపచ్చని బీభత్సమైంది.

"చేతులు, కాళ్ళు, తల, మెడ అన్నీ తీసేసిన మొండెం లాగుంది చూడండి నా పరిస్థితి" విషాదంగా నవ్వింది చెట్టు.

"అమ్మా బాధ పడకమ్మా! నువ్వు అట్లా అంటే మేము ఏమైపోవాలమ్మా. కనుచూపు మేర పచ్చటి మొలకే లేదు" ఆందోళనగా చెప్పింది డింగిరిపిట్ట.

"బాధపడకండి మీరు. ఆ తాతే మీక్కూడా దారి చూపిస్తాడు. ఆయన మనిషీ మనసూ ఆలోచనా అన్నీ ఆకుపచ్చగానే ఉంటాయి. నా నమ్మకమే నిజమైతే ఆయన ఈ ఎండిన ఎడారిలోనుండైనా ఆకుపచ్చని మొలకలు మొలిపిస్తాడు. మొండాల్ని చూసుకుని ఎలా ఏడుస్తున్నాడో చూడండి. పాపం... చూడండి. కళ్ళ వెంబడి కన్నీరు కారి కారి చివరకు రక్తం కారుతుంది చూడండి".

అమ్మో రక్తమే. అవును. అబ్బా... అబ్బబ్బా... రక్తం... మరి రక్తం ఎర్రగా ఉండాలి కదా! ఆకుపచ్చగా ఉందేంటమ్మా" వడ్రంగిపిట్ట అడిగింది.

ఆయన పుట్టింది, పెరిగింది, తిరుగాడింది, పచ్చటి వనాల్లోనే కదా! తినే తిండీ, పీల్చే గాలీ, తాగే నీరూ అంతా ఆకుపచ్చని ప్రకృతే. అందుకే ఆయనే ఒక ఆకుపచ్చని కలగా మారిపోయాడు.

ఎన్నెన్ని హరితవనాల్లో మాయమయ్యాక కాస్తంత నీడకోసం మా వంచన చేరాడు. ఇక్కడ తల దాచుకోవడం మొదలయ్యాక కొంత దుఃఖం మరిచిపోయాడు కానీ మౌనాన్నే ఆశ్రయించాడు. ఎవ్వరితోనూ మాట్లాడేవాడు కాదు. ఎవరన్నా పలకరిస్తే ఒక చిరునవ్వు నవ్వి ఊరుకునేవాడు. ఇప్పుడు నువ్వుల్లే ఆటంకపరిచేవాళ్ళే లేరుకదా! అందుకే తట్టుకోలేకపోతున్నాడు.

ప్చ్... ఆయన శోకం గర్భశోకంగా మారింది. ఎంతమంది వస్తున్నా లోటు లేదు. నేలమీద పడి ఎలా పొర్లుతున్నాడో! పాపం ఎప్పటికో! ఇప్పుడు ప్రాణాల్ని, మొండాన్ని తడుముకోవాలని చేతులు చాచింది వేప. ఒకో కొమ్మ తరువాత గుర్తొచ్చింది.

ఎవ్వరూ ఏమీ చెయ్యలేరిక. ఆయన దేహం తేమ లేని చెట్టులా మారిపోయింది. ఎక్కడా సజీవ శ్వాసే కనిపించడము లేదు. ఇదే ఆఖరి చూపా ఏమిటి?

ఊ... హూ అలా జరగడానికి వీల్లేదు. ఆయనో ఆశాజీవి.

ఉన్నట్టుండి ఆయనలో ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించింది.

"చూశారా! అనుకుంటే ఏదైనా చెయ్యగలడా ఋషి.

అంతమందికి అలవికాని తాత ఒక్క నిముషంలో ఎలా మారిపోయాడో! చూడండి... ఊ... ఊ... పైకి లేస్తున్నాడు.

ఆహా ఆయన ముఖంలో జీవకళ తొణికిసలాడుతుంది. చిగురిస్తున్నాడు. చిరునవ్వు నవ్వుతున్నాడు. కాంతిరేకలు విచ్చుకుంటున్నాయి. కన్నుల నిండా దారులు మొలుస్తున్నాయి. చీకట్లు చీలిపోతున్నాయి. చుట్టూతా చూస్తున్నాడు.

ఏదో దృఢమైన అభిప్రాయానికే వచ్చినట్టున్నాడు. పై కండువా విదిలించాడు. తలగుడ్డ చుట్టాడు. కాళ్ళకు చెప్పులు వేసుకుంటున్నాడు. ఎవరో ఏదో రహస్యం చెబుతున్నట్టుగా చెవియొగ్గి వింటున్నాడు.

కళ్ళు ఆకుపచ్చగా మారాయి. చూపులు పచ్చపచ్చగా మారాయి. ఆలోచన ముదురాకుపచ్చ రూపు కట్టింది. దారంతా వర్ణం మార్చుకుంది.

దారి పట్టాడమ్మా. ఇంక తాతను ఎవ్వరూ ఆపలేరమ్మా. వెళ్ళిపోతున్నాడు. ఆయన వెనుక ఆకుపచ్చని తేజస్సు ప్రతిఫలిస్తుంది. మొలకెత్తుతున్నాడు. ఆహాహా ఇంక మీకేం దిగుల్లేదు. చిగురిస్తున్నాడు. కొమ్మలు రెమ్మలుగా విస్తరిస్తాడు. ఏపుగా పెరగనూ గలడు. ఎవ్వరు ఆపినా ఆగడిక.

లేవండి. మీరు కూడా ఆయన వెంటబడి వెళ్ళండి. మొదట వొద్దు వొద్దంటాడు. కాదు కాదంటాడు. ఆ తరువాత తానే అక్కున చేర్చుకుంటాడు. కోపం పోవాలిగా.

పదండి. మీకు తిండి దొరుకుతుంది. మీకు నీడ దొరుకుతుంది. మీకు గూడు దొరుకుతుంది. అన్నింటినీ మించి ఆప్యాయతా దొరుకుతుంది. లేవండి. తొందరగా ఆయన వెంట పడండి. ఇవాళ్టికి వదిలేసినా రేపైనా నా మొండేన్ని భూమిలో నుండి పెళ్ళగించేస్తారు. భూమిని కుళ్ళగించేస్తారు. మీరెళ్ళండి. మీ బతుకు దెరువు మీరు చూసుకోండి".

"ఎట్టమ్మా నిన్ను వొదిలి యెల్లాలంటే మాకు ఏడుపొస్తుందమ్మా. మొండేన్ని పట్టుకుని భోరున ఏడుస్తున్నాయి. ఒక దానినొకటి ఓదార్చుకోలేకపోతున్నాయి. వదలలేక వదలలేక వొదులుతున్నాయి. లేవలేక లేవలేక లేస్తున్నాయి. మొండెంతోనే మొండి వీడ్కోలు చెప్పింది వేప.

తన మాట చెల్లుబాటు కానిచోట ఇంక ఒక్క క్షణమైనా ఉండలేకపోతున్నాడు. తన పిల్లల దగ్గర కాకపోయినా ఎక్కడైనా తన కలను నెరవేర్చుకోగలను అనుకుంటూ వేగంగా నడుస్తున్నాడు తాత.

దారి పట్టాడమ్మా. ఇంక తాతను ఎవ్వరూ ఆపలేరమ్మా. వెళ్ళిపోతున్నాడు. ఆయన వెనుక ఆకుపచ్చని తేజస్సు ప్రతిఫలిస్తుంది. మొలకెత్తుతున్నాడు. ఆహాహా ఇంక మీకేం దిగుల్లేదు.

ముందు ఆకుపచ్చని సముద్రం కళ్ళనిండా కనిపిస్తుంటే ఆ దిశగా వడివడిగా వెళ్తున్నాడు.

ఆయన ఆలోచనల నిండా, మనసునిండా, దేహం నిండా ఆకుపచ్చని స్పర్శ తడితడిగా తగులుతోంది. ఆయనో హరిత వనంలా ఊగిపోతున్నాడు.

రామచిలుకలు, గోరువంకలు, జెముడుకాకులు, ఊర పిచ్చుకలు, రాబందులు, గూడకొంగలు ఆయన చుట్టూ మునురుకుంటున్నాయి. తనకేం తెలియనట్టే పోతున్నాడు. ఒక చిలుక భుజంపై వాలింది. చూసినా చూడనట్టే నటిస్తున్నాడు. చిలుక ముక్కుతో గిల్లింది. ఆయన తనలో తానే నవ్వుకున్నాడు. చిలుక కూడా నవ్వింది. ఆయనా నవ్వాడు. పక్షులన్నీ గలగలా నవ్వాయి. కలకలా నవ్వాయి. కిలకిలా నవ్వాయి.

ఆయన నడుస్తున్న దారిలో మేఘంలా ఏర్పడ్డాయి. ఆయనకు ఛత్ర కవచంలా మారాయి. ఆయన వెంటే పక్షి మేఘం కదులుతుంది. తాత ముందుకు సాగుతూ ఉన్నాడు. దారి స్పష్టంగా కనిపిస్తుంది. దారి ఆకుపచ్చగా కనిపిస్తుంది.

•